క్లుప్తంగా

ఎమ్మెల్యే అన్నాకు సన్మానం



ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో ఏపీవో

గిద్దలూరు రూరల్: స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబును పట్టణంలోని ఆయన నివాసంలో ఎస్ఆర్‌ఈజీఎస్ బేస్తవారిపేట ఏపీవో మోషే సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. త్రిపురాంతకం నుంచి బదిలీపై బేస్తవారిపేట వచ్చిన సందర్భంగా సిబ్బందితో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు.

350 మందికి వైద్య పరీక్షలు



వైద్యశిబిరం వద్ద వృద్ధులు

అర్ధవీడు (కంభం): డా.బ్రహ్మానందరెడ్డి హాస్పిటల్ గిద్దలూరు వారి ఆధ్వర్యంలో అర్ధవీడులో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు 350 మందికి బీపీ, షుగరు, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించిన అనంతరం డా.బ్రహ్మానందరెడ్డి పర్యవేక్షణలో వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు అందించనున్నట్లు తెలిపారు.

ఆర్‌బీకేలో డిజిటల్ టీవీ చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

దొనకొండ: స్థానిక సచివాలయం–1 పరిధిలోని ఆర్‌బీకేలో ఆదివారం రాత్రి దొంగలు డిజిటల్ టీవీని దొంగిలించారు. ఆర్‌బీకే సిబ్బంది ఉదయం విధుల్లోకి వచ్చి లోపలికి వెళ్లగా డిజిటల్ టీవీ చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సైదుబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. మార్కాపురం నుంచి క్లూస్ టీమ్ వచ్చి వేలి ముద్రలు సేకరించింది.

గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధం

గిద్దలూరు రూరల్: మండలంలోని గుమ్మళ్లపల్లె గ్రామంలో గ్యాస్ సిలిండర్ లీకై పూరిల్లు దగ్ధమైన సంఘటన సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన గుమ్మళ్ల మహేష్ పూరింట్లో వంట చేసే సమయంలో గ్యాస్ సిలిండర్ నుంచి వచ్చిన మంటల కారణంగా గుడిసెకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

నేడు సర్వసభ్య సమావేశం

కంభం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 16వ తేదీ ఉదయం ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నర్సయ్య తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

యర్రగొండపాలెం: స్థానిక సచివాలయం–2 పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు పొదిలి, రామలవీడులో..

పొదిలి రూరల్: పొదిలి మండలంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ సూర్జమాన్ తెలిపారు. ఉదయం 7 గంటలకు పొదిలి నగర పంచాయతీ సచివాలయం–6 పరిధిలోని టైలర్స్ కాలనీ, మంగలి కాలనీ, సాయంత్రం 4 గంటలకు ఆముదాలపల్లి సచివాలయం పరిధిలోని రాములవీడులో ఎమ్మెల్యే పర్యటిస్తారని వివరించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

గిద్దలూరు రూరల్: గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా అధికార యంత్రాంగం పనిచేయాలని సూచించారు. ప్రధానంగా నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆకుల రంగనాయకులు, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, అన్ని శాఖల అధికారులు ,ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సకల హంగులతో
సర్కారు దవాఖానా

- రూ.1.62 కోట్లతో పొదిలి సీహెచ్‌సీ అభివృద్ధి
- వైద్యుల పోస్టులు భర్తీ
- అందుబాటులోకి సౌకర్యాలు, అన్ని రకాల మందులు
- నాలుగు రెట్లు పెరిగిన ఓపీ
- రాష్ట్ర స్థాయిలో 33, జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు



నాడు–నేడులో భాగంగా నూతనంగా నిర్మించిన సీహెచ్‌సీ భవనం

పొదిలి: జిల్లా నడికూడలి పొదిలిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సకల హంగులతో సరికొత్తగా రూపుదిద్దుకుంటోంది. పొదిలి చుట్టు పక్కల మండలాల్లో ఏ ప్రమాదం జరిగినా ఈ ఆస్పత్రికే తరలిస్తుంటారు. గతంలో అయితే వైద్యులు లేరని, మందులు, యంత్రాలు లేవని ఒంగోలు పంపించేవారు. దీంతో బాధితులు వైద్యానికి వేల రూపాయలు ఖర్చు చేసి అప్పుల పాలయ్యేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేశారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పొదిలి వైద్యశాల రూపురేఖలు మారిపోవడంతోపాటు అన్ని రకాల మందులు అందుబాటులోకి వచ్చాయి. వైద్యుల నియామకాలు శరవేగంగా జరిగిపోయాయి.

రూ.1.62 కోట్లతో అభివృద్ధి

సీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.62 నిధులు మంజూరు చేసింది. ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో నిధులు మంజూరు కాగా మేఘా ఇంజినీరింగ్ సంస్థ పనులు చేపట్టింది. తుది దశ పనులు వేగంగా సాగుతున్నాయి.

అన్ని విభాగాలు సౌకర్యవంతంగా..

నూతన భవనంలో అన్ని విభాగాలు సౌకర్యవంతంగా ఉండేలా డిజైన్ చేశారు. ఆపరేషన్ థియేటర్, సెప్టిక్ ఆపరేషన్ థియేటర్, లేబర్‌రూం(కాన్పుల గది), సెప్టిక్ లేబర్ రూం, ఎక్స్‌రే యూనిట్, ఎమర్జెన్సీ వార్డు, చిన్న పిల్లల చికిత్స వార్డు(ఎన్‌బీఎస్‌యూ) పనులు దాదాపు పూర్తయ్యాయి. భవనాన్ని త్వరలోనే ప్రారంభించి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులో తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది

వైద్యశాలలో మొత్తం ఎనిమిది మంది వైద్యులు అవసరం కాగా ఇప్పుడు ఏడుగురు వైద్యులు విధుల్లో ఉన్నారు. గైనకాలజీ డాక్టర్ మాత్రమే సోమ, మంగళవారాల్లో అందుబాటులో ఉంటున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ మినహాయిస్తే మిగిలిన సిబ్బంది పోస్టులన్నీ భర్తీ చేశారు.



పొదిలి సీహెచ్‌సీ వద్ద క్యూలో రోగులు(ఫైల్)

జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు



వైద్యసేవల్లో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 33వ ర్యాంకులో ఉన్నాం. గతంలో 80 వరకే ఉండే ఓపీలు, ప్రస్తుతం 300కు చేరాయి. సీజనల్ వ్యాధుల సమయంలో 450 వరకు ఓపీలు ఉంటున్నాయి. కొత్త భవనం పూర్తయితే, సీహెచ్‌సీలో 30 పడకలకు అవసరమైన ఎక్విప్‌మెంట్ మొత్తం అందుబాటులోకి వస్తుంది. వైద్యుల కొరత, మందుల కొరత లేదు. బడ్జెట్ కేటాయింపులు బాగున్నాయి.

– డాక్టర్ చక్రవర్తి, వైద్యాధికారి

టెన్త్ టాపర్స్‌కు నగదు బహుమతులు



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చేతుల మీదగా ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. సోమవారం స్థానిక సచివాలయ–2 పరిధిలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఎంఈవో పి.ఆంజనేయులు రూ.5116 చొప్పున నగదు ప్రకటించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పి.అశ్రిత దేవరాయ, షేక్ ఆరిఫ్, గిరిజన సంక్షేమ పాఠశాల విద్యార్థి అశోక్ నాయక్‌లకు మంత్రి నగదు బహుమతులు అందజేయడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

జనపనార సంచుల శిక్షణ కేంద్రం ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలోని దిగువమెట్ట గ్రామంలో జనపనార సంచుల తయారీ శిక్షణ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలగకుండా జనపనార సంచుల తయారీలో మహిళలు ప్రత్యేక శిక్షణ పొందడం కోసం ఇటువంటి కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అడవికి దగ్గరగా నివసించే వారికి జీవనోపాధి కోసం ప్రభుత్వం ఇటువంటి మార్గాన్ని చూపిస్తోందన్నారు. జనపనార సంచుల తయారీలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ చూపి అందులో నైపుణ్యం సాధించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు, రేంజ్ ఆఫీసర్ జీవన్‌కుమార్, డీఆర్వో వంశీకృష్ణ, జెడ్పీటీసీ బుడతా మధు, వైఎస్సార్ సీపీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ



పూజలు చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

ముండ్లమూరు: మండలంలోని వేంపాడులో ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. అద్దంకి–దర్శి ప్రధాన రహదారిలో వేంపాడు వద్ద ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజ స్తంభం ఏర్పాటు కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

అన్నదానం చేశారు. ఆమె వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సర్పంచ్‌ల సంఘ మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, రెడ్డి సంఘ జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బంకా నాగిరెడ్డి, యరబ్రోలు శ్రీనివాసరెడ్డి, వీరయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

సత్తా చాటిన పల్నాడు జిల్లా ఎడ్లు



చింతలపాలెంలో బండ లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని చింతలపాలెంలో వీరాంజనేయస్వామి జయంతి సందర్భంగా సోమవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా శావల్యాపురానికి చెందిన మంద్రు మల్లయ్య, పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి సంయుక్త ఎడ్ల జత 3,400 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.20 వేలు, మార్టూరు మండలం దాసరిపల్లెకు చెందిన బోగాది గోపాల్ ఎడ్లు 3,116 అడుగులతో ద్వితీయ బహుమతి రూ.15 వేలు, వైఎస్సార్ జిల్లా బీ.మఠం మండలం కేశాపురానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు 2,701 అడుగులతో మూడో బహుమతి రూ.10 వేలు, కొమరోలు మండలం అలసందలపల్లెకు చెందిన బిజ్జం నారాయణరెడ్డి, మార్కాపురం మండలం తిప్పాయిపాలెం శ్రీనివాసరెడ్డి సంయుక్త ఎడ్ల జత రూ.2,600 అడుగులతో నాలుగో బహుమతి రూ.5 వేలు గెలుపొందాయి.

వేతనం చెల్లించాలని వినతి

తాళ్లూరు: మండలంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడార్‌లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సంఘ నాయకులు ఎంపీడీఓ వై.శ్రీనివాసరావును సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. ఇప్పటికే కొందరికి సంవత్సర కాలం పాటు వేతనాలు రావాల్సి ఉందని, మండలంలో 53 మంది గ్రీన్ అంబాసిడార్స్ ఉండగా ప్రస్తుతం 33 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. సంఘ నాయకులు రమేష్, రామారావు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కేశవరావు

మార్కాపురం టౌన్: భూదేవి శ్రీదేవి సమేత లక్ష్మీచెన్నకేశవ స్వామి వారి దేవస్థానంలో రంగనాయకస్వామి, ఆండాళ్ అమ్మవారి ఉపాలయాల పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్త కృష్ణ, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టి.బాలసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శివలింగ ప్రతిష్ఠకు హాజరైన స్వాత్మానందేంద్రస్వామి



శివలింగానికి పూజలు చేస్తున్న స్వాత్మానందేంద్రస్వామి

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోటలో 1375 ఏళ్ల క్రితం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం నిర్మించారు. ప్రస్తుతం నూతనంగా నిర్మాణానికి సింగిల్ ట్రస్టీ చైర్మన్ ముక్కమాల మనోజ్ రూ.80 లక్షలు, గ్రామస్తుల సహకారంతో గుడి నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం జీర్ణోద్ధరణ కోసం వైజాగ్ శారదా పీఠం నుంచి స్వాత్మానందేంద్ర స్వామి వారు కొచ్చెర్లకోట గ్రామానికి విచ్చేసి శివలింగ ప్రతిష్ఠ చేశారు. గ్రామాల నుంచి అఖండ ప్రజానీకం తరలి వచ్చారు. వేలాది మందికి అన్నదానం చేశారు.

జగన్నాథపురంలో నీటి వనరులపై సర్వే



విలేజ్ మ్యాప్‌ను వివరిస్తున్న సర్పంచ్ వెంకటరెడ్డి

తర్లుపాడు: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఎఫర్ట్, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి కుంటలు, చెరువులను మ్యాపింగ్ చేశారు. గ్రామంలో మౌలిక వసతులను పరిశీలించారు. మంచినీటి లభ్యత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బందితో సమావేశమై గ్రామంలోని రైతుల అవసరాలను సాగు నీటి లభ్యతతో పాటుగా పలు అంశాలపై చర్చించారు. గ్రామంలోని వాయలకుంటను అభివృద్ధి, మంచినీటి స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటుకు సహకరిస్తామని రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రాజెక్టు అధికారి బాబురావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా వెంకటరెడ్డి, ఎఫర్ట్, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహాలు త్వరగా నిర్మించుకోవాలి



పత్రాలు అందిస్తున్న జేసీఎస్ కన్వీనర్, అధికారులు

తాళ్లూరు: పేదలందరికీ నివాసాలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని తాళ్లూరు–2 జేసీఎస్ కన్వీనర్ కొర్రపాటి విష్ణు అన్నారు. కొర్రపాటివారిపాలెంలో సొంత స్థలాల్లో నివాసాలు నిర్మించుకునేందుకు పులి రేఖ, సంగం సునీత, కొమ్మాలపాటి అరుణ, పులి మరియమ్మను నివాసాలు మంజూరు కాగా వారి మంజూరు పత్రాలను సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాపిరెడ్డి అందించారు. తాళ్లూరు–2 జేసీఎస్ కన్వీనర్ మాట్లాడుతూ సొంత స్థలాల్లో నివాసాలు నిర్మించుకునేందుకు ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, స్థానిక ప్రజాప్రతినిధుల కృషితో అనుమతి మంజూరైందని చెప్పారు. త్వరగా నివాసాలు నిర్మించుకోవాలని, బిల్లులు సకాలంలో అందిస్తున్నట్లు చెప్పారు.

స్టడీ అవర్స్‌ను వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: పదో తరగతి విద్యార్థులకు ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శామ్యూల్ జాన్ పేర్కొన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ, పిడికిటివానిపల్లి జెడ్పీలో జరుగుతున్న పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరుగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి తప్పిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పాఠశాలలోనే వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుందని, అందులో భాగంగా ఉపాధ్యాయులు తప్పిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారిని ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థులు కూడా తప్పని సరిగా ప్రత్యేక తరగతులకు హజరు అవుతూ త్వరలో జరిగే పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.

క్షేత్ర సహాయకుడిని నియమించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

ముండ్లమూరు: మండలంలోని బృందావనం తండా పంచాయతీకి నూతన క్షేత్ర సహాయకుడిని నియమించాలని కోరుతూ ఆ గ్రామ సర్పంచ్ జానావత్ లక్ష్మీబాయి, వార్డు సభ్యులతో కలిసి సోమవారం ఎంపీడీఓ కె.కుసుమకుమారికి వినతి పత్రం అందజేశారు. నూతనంగా పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి క్షేత్ర సహాయకుడు లేకపోవడంతో అక్రమాలు జరుగుతున్నాయని ఆమె దృష్టికి తీసుకొచ్చింది. తమ పంచాయతీకి చెందిన జానావత్ చిన్న నాయక్‌ను క్షేత్ర సహాయకుడిగా నియమించాలని కోరారు. స్పందించిన ఎంపీడీఓ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

డబ్బులిస్తేనే ఆన్‌లైన్ చేస్తామంటున్నారు..



తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేస్తున్న రైతు నర్సిరెడ్డి

ముండ్లమూరు: డబ్బులిస్తేనే పొలాన్ని ఆన్‌లైన్ చేస్తామని కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన పందుగుల నర్సిరెడ్డి తహసీల్దార్ నయాం అహ్మద్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 148, 276లో తనకి ఎకరా 58 సెంట్లు భూమి ఉండగా దాన్ని ఆన్‌లైన్ చేయించుకునేందుకు రెవెన్యూ సిబ్బందిని కలిస్తే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ విచారించి న్యాయం చేస్తానని రైతుకు భరోసా ఇచ్చారు.

ఘనంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహం

కొమరోలు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కొమరోలులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వెలసిన ఆంజనేయ స్వామి దేవాలయంలో రెండు రోజులుగా ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తిని కొమరోలులోని పురవీధుల్లో మేళతాళల నడుమ ఊరేగించారు. భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్

మార్కాపురం: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు ప్రశాంతంగా సాగినట్లు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య తెలిపారు. సోమవారం ఉదయం సెషన్‌లో 140 మందికిగాను 131 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 140కిగాను 130 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి తెలిపారు. టీసీఎల్‌గా వేశపోగు శ్యామ్‌బాబు, డాక్టర్ జేవీ అనిల్‌కుమార్ వ్యవహరించినట్లు చెప్పారు.

ఘర్షణ కేసులో ముగ్గురు అరెస్టు

కొమరోలు: ఘర్షణ కేసులో ముగ్గురు నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు కొమరోలు ఇన్‌చార్జి ఎస్సై వి.మహేష్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. పాత పోలీసు కేసు నేపథ్యంలో కొమరోలు మండలంలోని అక్కపల్లె గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. పెద్ద ఓబులేసు, నడిపి ఓబులేసు, ఓబులమ్మపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన జంగాల భూలక్ష్మి, జంగాల గురువయ్య, భూమా లక్ష్మయ్యను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంఘటన జరిగిన అనంతరం పరారీలో ఉన్న ముగ్గురిని సోమవారం కొమరోలు పరిసర ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బాలయ్య

కొనకనమిట్ల: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కొనకనమిట్ల వైద్యాధికారి బాలయ్య, ఎంపీడీఓ జనార్దన్ సూచించారు. సోమవారం సర్పంచ్‌లు, డాక్టర్లు, శానిటేషన్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా మంచి నీరు, మజ్జిగ తాగాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు వేడి తీవ్రత నుంచి రక్షణకు గొడుగులు, టోపీలు వాడాలన్నారు.